

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

**జర సామ్నేతో ఆవో ఛలియే**

**ఛుప్ ఛుప్ ఛల్నే మే క్యా రాజ్‌హై**

**యూన్ ఛుప్ నా సకేగా పరమాత్మా**

**మెరీ ఆత్మాకి యే ఆవాజ్ హై!**

హిందీ సినీ పాటల ప్రేమికులందరికీ తప్పని సరిగా తెలిసే యుగళ గీతం ఇది. భరత్‌వ్యాస్ రాయగా ఎస్.ఎన్. త్రిపాఠి సంగీత దర్శకత్వం వహించిన పాట ఇది. లత, రఫీల యుగళ గీతాల ప్రత్యేకతను ప్రస్ఫుటం చేసే గీతాలలో ముందుగా పేర్కొనే గీతం ఇది. అత్యద్భుతమైన గీతం ఇది. బాణీ పరంగా, గానం పరంగానే కాదు, గీత రచన పరంగా కూడా అత్యుత్తమమైన గీతం ఇది. ఈ పాట తెలిసిన వారెందరికో  ఈ సినిమా పేరు తెలియదు. ఆ సినిమా పేరు తెలిసినా అందుకు కారణం ఈ పాటనే అయి ఉంటుంది.

'జనమ్ జనమ్ కే ఫేరే' అనే సినిమాలోదీ పాట. ఈ సినిమా గమ్మత్తయినది. సాంఘికం, పౌరాణికం కలగలిపిన సినిమా. నాస్తిక భర్తను ఆస్తికుడిగా మార్చాలని కంకణం కట్టుకున్న పతివ్రత అన్నపూర్ణ కథ ఇది. అందుకే సినిమా పేరు 'జనమ్ జనమ్ కే ఫేరే' అను సతీ అన్నపూర్ణ కథ అని ఉంటుంది. సినిమాలో పేర్లు వచ్చే సమయంలోనే సినిమా కథా సారాంశాన్ని వివరించే టైటిల్ గీతం వస్తుంది .రఫీ ఎంత గొప్పగా పాడతాడో, భరత్ వ్యాస్ గీత రచన అంత గొప్పగా ఉంటుంది.

**జనమ్ జనమ్ కే ఫేరే**

**సాంఝ్  సవేరే సబ్‌కో ఫేరే**

ఇన్‌సే న కోయీ బచే హై

యే హై జనమ్ జనమ్ కే ఫేరే.

జన్మజన్మల వలయాన్నుంచి ఎవ్వరూ తప్పించుకోలేరు. రాత్రింబవళ్లు అందరినీ ఆవరించి ఉంటాయవి. ఎవ్వరూ ఈ సంసార చక్రం నుంచి తప్పించుకోలేరు. మృత్యువు, జన్మ, మృత్యువు జన్మల వలయంలో తిరుగుతూండే వారే అందరూ. ఈ పాటతో సినిమా ఆరంభమవుతుంది. సినిమాలో కీలకమైన సన్నివేశలలో ఈ పాట ఒకో చరణం వస్తూంటుంది. ఈ పాటను భరత్ వ్యాస్ ఎంతో గొప్పగా రాశాడు. ఈ పాట భారతీయ ధర్మంపై భరత్ వ్యాస్‌కు ఉన్న లోతైన అవగాహనను ప్రతిబింబిస్తుంది.

మధురా జా , వృందావన్ జా

చాహే ఫేరా లగాలే కాశీకా

సబ్‌కుఛ్ సహెనా పడేగా బందే

చక్కర్ హై లాఖ్ చౌరాశీ కా

మాయా మోహ్ కే యే ఘేరే

మద్ లోభ్ క్రోధ్ కే యే అంధేరే

ఇన్‌సే నకోయీ బచేహై

యే హై జనమ్ జనమ్ కే ఫేరే.

ఎలాగయితే సాలెగూడు, గూడు అల్లుతూ అన్ని దారాలను కలుపుతూ, ముందు వేసిన దారాన్ని నడుమ నుంచి చివరి తీగ వరకూ కలుపుతూ అందమైన రూపు నిర్దిష్టమైన రీతిలో ఏర్పాటు చేస్తుందో, అలా భరత్ వ్యాస్ ఒక అద్భుతమైన రూపును పాటకు ఆపాదించడం కనిపిస్తుంది.

ఆరంభంలో రాత్రింబవళ్లు అందరినీ ఆవరించి ఉన్న జీవన్మరణ వలయం నుంచి ఎవరూ తప్పించుకోలేరని చెప్పాడు. చరణంలో మధుర వెళ్లినా, బృందావనం వెళ్లినా, కాశీలో పరిక్రమ చేసినా, అన్నీ అనుభవించాల్సిందే, భరించాల్సిందే, ఎందుకంటే ఇది 'లాఖ్‌చౌరాశియా' కాబట్టి.

భారతీయ ధర్మంలో ప్రకృతి, పురుషుడు, పదార్ధము, చిద్, అచేతనము, చేతనమూ క్షేత్రము, క్షేత్రజ్ఞ బ్రహ్మ, పరబ్రహ్మ, ఆత్మ, పరమాత్మ, దేహం, జీవం వంటి ఆలోచనలున్నాయి, 'సృష్టి' గురించి. భారతీయుల నమ్మకంలో ప్రతి ప్రాణికీ ఆత్మ ఉంటుంది. శరీరం నశిస్తుంది. ఆత్మకు నాశనమన్నది లేదు. ఆత్మ ఒక శరీరం విడిచి మరో శరీరాన్ని ధరిస్తుంది. కామ, క్రోధ, లోభ, మద, మాత్సర్యాలు విధించే సంకెళ్లను దాటి తన అసలు స్వరూపం గ్రహించిన ఆత్మ జీవన్ముక్తం అవుతుంది. జీవన్మరణ సంసార చిత్రాన్ని 'లాఖ్‌చౌరశీ' అంటారు. అంటే ఈ సంసార చక్రం, జీవన మరణాల చట్రాలనుంచి బయల్పడి జీవన్ముక్తం కావటానికి 8,400,000 రకాల జీవుల జన్మలు ఎత్తాలని అంటారు. 'లాఖ్‌చౌరశీ' అని భరత్ వ్యాస్ వాడిన పదం వెనుక దాగి ఉన్న ఆలోచన ఇది. ఈ 8.4 మిలియన్ రకాల జీవుల ఆలోచన భారతీయ ధర్మంలో ఎన్నో మిలియన్ సంవత్సరాలనుంచీ ఉంది.

'ఫండమెంటల్స్ ఆఫ్ మాలిక్యులర్ ఎవల్యూషన్' అన్న పుస్తకంలో గ్రావ్, లీలు విశ్వంలో 4.5 నుండి 10 మిలియన్ రకాల జీవులుండవచ్చని సూచించారు అంటే, ఒక జీవి ఇన్ని రకాల జన్మలు ఎత్తవలసిందేనన్నమాట. ఈ జీవన్మరణ చక్రం నుంచి ఎవ్వరూ తప్పించుకోలేరు. మధుర వెళ్లినా, బృందావనం వెళ్లినా, కాశీని దర్శించినా ఈ 'లాఖ్ చౌరశీ' జన్మలు అనుభవించాల్సిందే. అన్ని బాధలూ పడాల్సిందే. అన్ని సౌఖ్యాలు, ఆనందాలు అనుభవించాల్సిందే. ఈ సినిమాలోనే మరో అద్భుతమైన పాటను రచించాడు భరత్ వ్యాస్.

**కభీ హోతా భరోసా**

**కభీ హోతా భరం**

**బడా ఉల్‌ఝన్ మే హై ఇన్సాన్**

**తూ హై యా నహీ భగవాన్**

దేవుడిని నమ్మని వాడికి ఎలాంటి సంశయాలుండవు. వాడికి దేనిపై నమ్మకం ఉండదు కాబట్టి సమస్యలేదు. సమస్య అల్లా దేవుడిని నమ్మేవాడికే. నమ్మకం అపనమ్మకాల నడుమ ఊగులాడెది ఆస్తికుడే. అడుగడుగునా దేవుడు లేడని

బోధించే వారి ప్రభావంలో పడకుండా తన విశ్వాసాన్ని నిలుపుకోవాలి. ఎలాంటి కష్టాలు ఎదురైనా, ఎన్నో ఎదురు దెబ్బలు తగిలినా, ప్రతికూల పవనాలు ఎంతగా వీచినా బెదరకుండా భగవంతుడిపై తన విశ్వాసాన్ని సడలకుండా కాపాడుకోవాలి. కానీ అప్పుడప్పుడు ఎంత ఆస్తికుడికయినా దేవుడు ఉన్నాడా? లేడా? అన్న అనుమానం కలుగుతుంది. 'ఉన్నావా? అసలున్నావా?' అని ప్రశ్నిస్తాడు. ఈ సినిమాలో నాయిక కూడా ఇదే సందేహాన్ని వ్యక్తపరుస్తోంది. 'తూహై యా నహీ భగవాన్?' అని అడుగుతోంది. 'నువ్వున్నావా? లేదా?' అని ప్రశ్నిస్తోంది.

**మత్ ఉల్‌ఝూన్ మే పడ్ ఇన్సాన్**

**తెరె సోచె బినా జబ్ హోతా హై సబ్**

**తో సమఝ్ లే కహీ  హై భగవాన్**

దైవం ఉనికిని ప్రశ్నించాల్సిన అవసరంలేదు. సంశయం కూడదు. వ్యక్తి ప్రమేయం లేకుండా అన్నీ సంభవిస్తూండటమే భగవంతుడి ఉనికికి సూచన అంటున్నాడు భరత్ వ్యాస్. కానీ నాస్తికులు ఇలాంటి సమాధానంతో సంతృప్తి పడరు.

దేవుడుంటే కనబడడెందుకు? అన్యాయాలను సహిస్తున్నాడెందుకు? ప్రపంచంలో ఇంత భయం, అణచివేతలు, క్రౌర్యం, దౌష్ట్యాలు ఎందుకున్నాయి? అని ప్రశ్నిస్తారు. 'మెరే సామ్నె ఆవో, ఆకె విశ్వాస్ దిలాయే వో' అంటారు. 'నాముందుకు వచ్చి తన ఉనికిని నిరూపించుకుని నాకు నమ్మకం కలిగించమని' కోరతారు.

**జీవన్ మరణ్ హాని ఔర్ ఫాయిదా**

**కర్మోంకా ఫల్ హై ఉస్ కా భీ కాయదా**

**ఇన్సాన్ కీ  కుఛ్ భీ చల్తీ  నహీ**

**కర్నీ అప్నీ కభీ టల్తీ నహీ**

**భక్తీ కే భావ్ సే ఉస్కో తూ జాన్ లే**

శ్రద్ధాకీ ఆంఖోం సే

ఉస్‌కో తూ పహెచాన్ లే

హోతా నహీ క్యా అచంభా బడా

ఆకాశ్ కిస్కే సహారే ఖడా

ఫూలోంమే రంగ్, ఝుర్నోంమే తరంగ్

ధర్తీ మే ఉమంగ్  జో ఉఠాతా

వో కౌన్?

క్యా తుం?

బాదల్ మే బిజ్లీ

పహాడోం మే జోఫూల్ ఖిల్‌తా

వో  కౌన్?

క్యా తుం?

వో  హై సర్వశక్తిమాన్

కణ్ కణ్  మే బసే,

పర్, న దిఖాయీదే.

ఉస్‌కీ శక్తి కో తూ  పహెచాన్

మత్ ఉల్ఝన్ మే పడ్

భక్తి, కర్మ జ్ఞాన సిద్ధాంతాలను ఒక్క ముక్కలో అలతి అలతి పదాలలో ఇమిడ్చి అత్యంత సరళంగా బోధించేశాడు భరత్ వ్యాస్.

ప్రతి కర్మకు తగిన ఫలం ఉంటుంది. కర్మనుంచి ఎవ్వరూ తప్పించుకోలేరు. ఇక్కడ మనిషిదేమీ లేదు. కర్మఫలం అనుభవించి తీరాల్సిందే, ఇది నియమం. కర్మనుంచి ఎవ్వరూ తప్పించుకోలేరు. భక్తి భావంతో ఈ నిజాన్ని గ్రహించవచ్చు. భక్తి అంటే అంకిత భావం. భక్తి, శ్రద్ధలు కవలల్లాంటివి. ఒకదాని వెంటే మరొకటి ఉంటుంది. భక్తి శ్రద్ధలను వెన్నంటే జ్ఞానం ఉంటుంది. 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం' అంటుంది భగవద్గీత. అందుకే 'భక్తిభావంతో భగవంతుడిని తెలుసుకో' అంటూనే 'శ్రద్ధ నిండిన నయనాలతో అతడిని గుర్తించు' అంటున్నాడు. ప్రతి కర్మకు ఫలితం ఉంటుంది కాబట్టి సత్కర్మలు చేసి సత్ఫలితం పొందాలి. భక్తితో నిజాన్ని గ్రహించాలి. శ్రద్ధతో భగవంతుడి ఉనికిని గుర్తించాలి. పూలకు రంగులను, నదులకు చైతన్యాన్ని, భూమికి సారాన్ని ఇచ్చిందెవరు? 'నువ్వా?' అని ప్రశ్నిస్తున్నాడు. మేఘాలలో మెరుపు, కొండలపై పూలను పూయించేది నువ్వా? అని నిలదీస్తున్నాడు. సర్వశక్తిమంతుడైన భగవంతుడు సృష్టిలోని కణకణంలో ఉన్నాడు. కానీ కనబడడు. అతని శక్తిని గ్రహించు. అయోమయంలో, సందేహాలలో పడకు అంటున్నాడు భరత్ వ్యాస్. ఒక సినిమా పాటలో ఇంత తత్త్వాన్ని, అన్ని కోణాలలో ఆలోచనలను ఎంతో చక్కగా ప్రదర్శించాడు భరత్ వ్యాస్. 'దేవుడు లేడు, ఉంటే చూపించు?' అనే వారి వాదనను తార్కికంగా, పూర్వపక్షం చేశాడు. కర్మ, భక్తి, శ్రద్ధ, జ్ఞానం అనే నాలుగు దారుల్లో భగవంతుడి ఉనికిని గ్రహించమని చెప్తున్నాడు. ఇదే భరత్ వ్యాస్ 'హరీభరీ వసుంధరా' పాటలో 'కణ్ కణ్ సే ఝాంక్తే హై తుమ్హే ఛబీ విరాట్‌కీ' అంటాడు. ప్రతి కణంలో భగవంతుడి విరాట స్వరూపం గోచరిస్తూ ప్రస్ఫుటమౌతూంటుందట. 'అప్నీతో ఆంఖ్ ఏక్ హై ఉస్‌కీ హజార్ హై' అని మనకు భగవంతుడు ఎందుకు కనబడడో, కేవలం మన చుట్టూ కనబడే చైతన్యంలో మాత్రమే భగవంతుడి ఉనికిని ఎందుకని గ్రహించాల్సి ఉంటుందో సున్నితంగా వివరించాడు. మనకు కన్ను ఒక్కటే. భగవంతుడు 'సహస్ర చక్షువు'. ఒక కన్ను వాడు వెయ్యి కన్నుల వాడిని చూడలేడు. వాడి పరిమిత దృష్టికి అపరిమితమైనది గోచరించదు. చీమ ఏనుగు ఉనికిని గ్రహించగలదే తప్ప, ఏనుగును చూడలేదు. అందుకని మనిషి భగవంతుడి ఉనికిని భావించాల్సిందే. దానికి భక్తి శ్రద్ధలు అవసరం. అవి ఉంటేనే ఈ జ్ఞానం తెలుస్తుంది. ఓ వైపు ఆధునిక భావాల ప్రభావంతో దేవుడు లేడని, దైవం బూటకం అనీ సినీ కవులు పాటలు రాస్తున్న సమయంలో భక్తి భావాన్ని ప్రదర్శిస్తూ, భగవంతుడి ఉనికిని అనుభవించే శక్తి ని సాధించమంటున్నాడు భరత్ వ్యాస్ తన పాటల ద్వారా.

సినిమాలో నాస్తికుడు, ఆస్తికుడై పాడిన పాటను కూడా ఇంతే అద్భుతంగా, తార్కికంగా రచించాడు భరత్ వ్యాస్. ఎక్కడా అంధ భక్తి, అంధ విశ్వాసం అని విమర్శించే వీలును ఎవరికీ ఇవ్వలేదు. అందుకే ఇతర గేయ రచయితలకు ప్రత్యేకంగా నిలుస్తాడు భరత్ వ్యాస్.

**మన్‌కె అంధియా మిటా**

**ఫైలా అమర్ ప్రకాశ్**

**నైనోంనే  దర్శన్ కియే**

**బుఝీ  హృదయ్ కీ  ప్యాస్**

**తన్‌కే తంబూరే మే**

**దో సాసోంకే  తార్ బోలే**

**జై రాధే శ్యాం శ్యాం**

దేవుడు లేడని వాదించాడు. ఇప్పుడు అతని హృదయంలోని చీకటి తొలిగిపోయింది. అతనిలో వెలుతురు నిండింది. వెలుతురు విజ్ఞానానికి ప్రతీక. చీకటి అజ్ఞానానికి ప్రతీక. అజ్ఞానంలో భగవంతుడు లేడన్నాడు. విజ్ఞానం రావటంతో, 'నైనోంనే దర్శన్ కియే', కళ్లు భగవంతుడి దర్శనం చేసుకున్నాయి. హృదయంలోని దాహం తీరింది. అంటే హృదయం దేనికోసం అన్వేషిస్తోందో ఆ అన్వేషణ తీరింది. తరువాత వచ్చిన భావం అత్యద్భుతం. శరీరమనే తంబూరాలో, ఊపిరుల తీగలు 'జై రాధేశ్యాం' అంటున్నాయి. ఎంత అత్యద్భుతమైన భావన. 'దో సాసోంకే తార్' రెండు ఊపిరుల తీగలు. ఉచ్ఛ్వాశ నిశ్వాసాలు...భగవంతుడి నామజపం చేస్తున్నాయి. 'తనువు తంబూర' అయింది. తంబూరను  'శృతి'కి వాడుతారు. దీన్ని 'శృతి వాద్యం' అంటారు. 'తంబూర', సంగీత పరిజ్ఞానంతో, ఆధ్యాత్మిక జ్ఞానంతో నారదుడంతటివాడిగా పరిగణకు గురయ్యే కిన్నెరుడు 'తంబురుడి' వాయిద్యం, ఈ వాయిద్యం  'స,ప' అనే రెండు స్వరాలు పలుకుతుంది 'దోసాసోంకీ తార్' . కళ్లు మూసుకుని ఈ రెండు స్వరాలు పలికిస్తూ ధ్యానం చేస్తే భగవద్దర్శన శాంతి కలుగుతుందంటారు. శరీరం 'తంబూర' అనటంతోటే, హృదయంలోని అంధకారం అదృశ్యమై, మనస్సు వెలుతురు మయమై, శరీరం భగవంతుడిని గ్రహించేందుకు శుభ్రమై, శృతి సాధించి సిద్దంగా ఉందని అర్ధం. అలాంటి వాయిద్యం శుద్ధ  స్వరాలు శృతిలో పలుకుతుంది, 'జై రాధే శ్యాం' అంటూ... అద్భుతమైన గేయ రచన సంవిధానం ఇది. గమనిస్తే అన్ని పాటలలోనూ ప్రదర్శితమవుతున్న భావంలో  ఏక సూత్రత ఉంది. దైవం లేడన్నప్పుడు భక్తి, శ్రద్ధ, జ్ఞానాల గురించి చెప్తాడు.  అవి సాధించిన తరువాత శరీరం తంబుర అయి భగవంతుడి నామం స్మరిస్తోందంటున్నాడు.

ఆస్తికుడయిన నాయకుడు భగవంతుడి ధ్యానంలో సర్వం మరచిపోతాడు. తనే తన ప్రాణంగా కల భార్య అన్నపూర్ణను మరచిపోతాడు. అతడు భగవంతుడిని అన్వేషిస్తూ తనకు కనబడకుండా దాగుడు మూతలాడుతూన్న భగవంతుడిని వెతుకుతూ పాడతాడు. ఆమె తనకు కనబడకుండా పోయిన తన భగవంతుడి సమానమైన భర్తను అన్వేషిస్తూ పాడుతుంది. ఈ సందర్భంగా భరత్ వ్యాస్ రాసిన పాట 'జర సామ్నే తో ఆవో ఛలియే '.

నాయిక, నాయకుడు ఇద్దరూ ఒకే పల్లవి పాడతారు. కానీ గేయ రచనలో భరత్‌వ్యాస్ చేసిన చమత్కారం ఏమిటంటే, నాయకుడు పాడేది భక్తిభావంతో, నాయిక పాడేది ప్రేమభావంతో అయినా ఇద్దరి భావాన్నీ ఒకే పల్లవి పలుకుతుంది. భక్తికీ, ప్రేమ భావనకూ నడుమ తేడా లేదని అతి సున్నితంగా తన గేయం ద్వారా నిరూపించాడన్నమాట భరత్ వ్యాస్, భక్తి అంటే సర్వం మరచి తనను తాను సమర్పించుకోవటం. ప్రేమ భావన కూడా అంతే. వ్యక్తి తన అస్తిత్వాన్ని కోల్పోయి భావనలో లయమై పోవటం, అది భగవంతుడిలో లయం అయితే భక్తి. వ్యక్తిలో లయం అయితే ప్రేమ.

ఒక్కసారి నా ముందుకు రావా, అంటే దర్శనం ఈయవా, మోసగాడా? అంటున్నారిద్దరూ. 'ఛలియా' మోసగాడు అని అర్థం వస్తుంది. శ్రీ కృష్ణుడు అన్న అర్థం కూడా వస్తుంది. అంటే శ్రీకృష్ణుడిని దర్శనం కోరుతున్నాడు నాయకుడు. నాయిక 'జరసామ్నేతో ఆవో ఛలియే' అంటే తనను మోసం చేసి వదలి వెళ్తున్న భర్తను తన దగ్గరకు రమ్మంటోంది. 'దాక్కుని కనబడకుండా ఉండటంలో అర్థం ఏమిటని?' నాయకుడు అంటే భగవంతుడిని ప్రశ్నిస్తున్నట్టూ, నాయిక అన్నప్పుడు భర్తను అడుగుతున్నట్టు అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. 'తూ ఛుప్ నా సకేగా పరమాత్మ' అని నాయకుడంటే 'ఓ పరమాత్మ నువ్వు దాక్కోలేవు నానుంచి' అన్న అర్థం వస్తుంది. ఎందుకంటే, చూడగలిగే కళ్లున్నవాడికి అడుగడుగునా భగవంతుడు కనిపిస్తూనే ఉంటాడు. అదే నాయిక అంటే, 'నువ్వు నానుంచి దాక్కుంటున్నావు కానీ పరమాత్మ నుంచి దాక్కోలేవు' అంటున్న అర్థం వస్తుంది. ఇది అతని ఆత్మ స్వరం. అది ఆమె ఆత్మ స్వరం. కానీ ఇద్దరి ఆత్మలు పరమాత్మ కోసం అన్వేషిస్తున్నాయి. అతను ఆమె పరమాత్మ. ఆయన అన్వేషిస్తున్నది 'పరమాత్మ'ను. ఇక్కడ ప్రదర్శితమవుతున్న సంబంధం పవిత్ర ఆత్మ, పరమాత్మల సంబంధం. ఇలాంటి గేయరచన సరళి నభూతో నభవిష్యత్.

హం తుమ్సే చాహే, తుం నహీ చాహో

ఐసా కభీనా హో సక్తా

పిత అప్నా బాలక్ సే బిఛడ్ కర్

సుఖ్ సే కభీ నా సో సక్తా

హమే డర్నేకి జగ్ మే క్యా బాత్ హై

జబ్ హాథ్ మే తిహారే మెరీ లాజ్ హై

ఇది నాయకుడు పాడుతున్నాడు. మనం భగవంతుడిని ప్రేమించటం, భగవంతుడు మనల్ని ప్రేమించకపోవటం అనే ప్రసక్తిలేనేలేదు. తన పిల్లవాడికి దూరమైన తండ్రి సుఖంగా నిద్రించే ప్రసక్తి లేదు. భగవంతుడికి సర్వం అర్పించి, ఆయన చేతిలో అన్నీ పెట్టేసినప్పుడు ఇక ప్రపంచమంటే భయం ఉండదు. భగవంతుడు తండ్రి. మనం పిల్లలం. తండ్రి పిల్లలను ప్రేమించటం అన్నదాన్లో సందేహం లేదు. సర్వం భగవంతుడికి అర్పించిన తరువాత భయం అన్నది ఉండనే ఉండదు. ఈ పాట రచించిన సమయంలో భరత్ వ్యాస్ కొడుకు తండ్రి తో విభేదించి ఇల్లు వదలి వెళ్ళిపోయాడు. ఈ పాట ఒకరకంగా భరత్ వ్యాస్ కనబడని తన కొడుకును వెతుకుతూ, అతడు తనకు దూరమయిన వేదనను గేయం రూపంలో ప్రదర్శించినట్టన్నమాట. అందుకే కొడుకుకు దూరమై ఏ తండ్రీ సుఖంగా నిద్రించలేదని రాశాడు భరత్ వ్యాస్. కవులంటే వాళ్ళు. వ్యక్తిగతాన్ని సార్వజనీన భావనలుగా మలచి అందించారు తరతరాలూ పాడుకుని సాంత్వన పొందేందుకు.

**ప్రేమ్ కి హై యే ఆగ్ సజన్ జో**

**ఇధర్ ఉఠే ఔర్ ఉధర్ లగే**

**ప్యార్ క్ హై యే కరార్ జియా'**

**అబ్ ఇధర్ సజే ఔర్ ఉధర్ సజే**

**తేరీ ప్రీత్ పె బడా హమే నాజ్ హై**

**మేం సర్ కాతూ హీ సర్ తాజ్ హై**

ఇది ప్రేమాగ్ని. ఎల్లెడల్లా రాజుకుంటోంది. సర్వత్ర ప్రేమ వల్ల శాంతి అలుముకుంటోంది. నీ ప్రేమ పట్ల నాకు గర్వం ఉంది. నా తలపై కిరీటం లాంటి వాడివి నువ్వు అంటోంది నాయిక. ఆమె ప్రదర్శిస్తున్న ప్రేమ మామూలు భౌతిక ప్రేమ కాదు. అందుకే సర్వత్ర శాంతి అలముకుంది. అతడి అచంచలమైన ప్రేమ పట్ల ఆమెకు నమ్మకం వుంది. ఆమె

పాడుతున్నది అతడి గురించే అయినా, ఇది భగవంతుడిపై భక్తుడికి వుండే అచంచలమైన విశ్వాసాన్నీ, అనంతమైన ప్రేమ భావననూ సూచిస్తుంది. నాయకుడి అంకిత భావన, నాయిక అంకిత భావనల స్వరూపం ఒకటే, తీవ్రత ఒకటే, శ్రద్ధ ఒకటే,. ఇద్దరి భావనలోని ఆధ్యాత్మిక భావన స్వరూపం ఒకటే.

ఇలాంటి పాటలు రచించటం మాములు విషయం కాదు. ముందుగా సంస్కారం ఉండాలి, దర్శక నిర్మాతలకు. అలాంటి దర్శక నిర్మాతలు, సంగీత దర్శకులతోనే భరత్‌వ్యాస్ పని చేశాడు. ఎక్కడా గేయ రచనతో రాజీ పడలేదు. తన స్థాయిని ఇసుమంతయినా తగ్గించలేదు. అందుకే 1950 దశకంలో 'భరత్ వ్యాస్ రాసిన 'ఏయ్ మాలిక్ తెరే బందె హం' పాట కానీ, 1970 దశకంలో రాసిన 'హంకో మన్‌కి శక్తి దేన' పాటకానీ ఈ నాటికీ ఉదయం భక్తి పాటలతోకార్యక్రమాలలో తప్పనిసరిగా వినిపిస్తాయి. పాఠశాలలో ప్రార్ధనా గీతాలుగా మన్ననలందుకుంటున్నాయి. ఇలాంటి అత్యద్భుతమైన గేయ రచయిత భరత్ వ్యాస్ ను సినీ గేయ విమర్శకులు, వ్యాఖ్యాతలు అగ్రశ్రేణి గేయ రచయితగా పరిగణించకపోవటం మన సినీ గీతాల విశ్లేషకుల దృష్టిలోపాన్ని స్పష్టం చేస్తుంది.

పాఠకులందరికీ నూతన సంవత్సర హార్దిక, ఆర్ధిక శుభాకాంక్షలు

(వచ్చేనెల మరిన్ని మంచి పాటలతో కలుద్దాం.)

Click here to share your comments